విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమ గోదావరి

చౌదరయ్యకు పరామర్శ

విశాలాంధ్ర-నిడమర్రు: మండలంలోని పెద్దనిండ్రకొలను గ్రామనికి చెందిన రంగస్థల కళాకారుడు వెజ్జు చౌదరయ్య నాయుడు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారని తెలిసి ఆయనను ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పత్సమట్ల ధర్మరాజు ఆదివారం పరామర్శించారు. ఆయనతో పాటు జనసేన నాయకులు వంగ రఘు, పచ్చకుల వాసు, బేవర అప్పారావు, గుండాబత్తుల ఏడుకొండలు, కందులపాటి సత్యనారాయణ, గ్రామ జనసైనికులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర-గణపవరం: గణపవరం మండలం కాశిపాడులో ప్రపంచ దోమల దినోత్సవం అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కోట నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమకాటు వల్ల వచ్చే వ్యాధులను నివారించవచ్చునని తెలిపారు. ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, ఎంపీటీసీ సభ్యులు జంపన పద్మావతి,వైయస్ఆర్ సీపీ గ్రామ నాయకుడు రమేష్ రాజు, సిల్వెస్ట్ రాజు, ఏఎన్ఎం శివ కుమారి, ఆశ కార్య కర్తలు వర లక్ష్మీ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం

విశాలాంధ్ర-ముసునూరు: మండలంలోని ముసునూరు గ్రామానికి చెందిన చిట్టూరి సాంబశివరావు కుమార్డు చిట్లూరి యశ్వంత్ మైలవరంలోని లక్కిరెడ్డి బాలరెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్‌లో బీటెక్ రెండోసంవత్సరం చదువుతున్నాడు. అతని కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం హైదరాబాద్‌లో ఉన్న దేవినేని విజయనారాయణ తెలుసుకున్నారు. రూ.20వేల నగదు చెక్కును గ్రామవాస్తవ్యులు దేవినేని వరప్రసాదరావు చేతుల మీదగా చెక్కు అందచేశారు. యశ్వంత్ కుటుంబం వారికి కృతజ్ఞతలు తెలిపింది.

ప్రతి ఒక్కరు భక్తి భావంతో మెలగాలి

విశాలాంధ్ర-భీమవరం టౌన్: సమాజంలో ప్రతి ఒక్కరు భక్తి భావంతో మెలిగినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని వైసీపీ యువత రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు రవితేజ అన్నారు. శ్రావణమాసం సందర్భంగా పట్టణంలోని 22వ వార్డులో ఆదివారం జరిగిన శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి జాతరను రవితేజ ప్రారంభించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్డు ఇన్చార్జి కరుకు పోతురాజు, బూది శ్రీను, మోది అప్పారావు, అమ్మాజీ కృష్ణ, కరుకు ఏడుకొండలు, కొక్కిరి గురుమూర్తి, లీల,మద్దాల సత్యనారాయణ, అడబాల పవన్ తదితరులు పాల్గొన్నారు.

22న పిల్లలకు ఉచిత గుండె పరీక్షల వైద్య శిబిరం

విశాలాంధ్ర-భీమవరం: పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం మేంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాద రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలను పరీశీలించి చేసి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 99490 93115, 9440859700, 63001 80993, 94943 38086 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

మణిపూర్ ఘటన సిగ్గుచేటు

విశాలాంధ్ర-భీమవరం: మణిపూర్‌లో గిరిజన క్రైస్తవులపై దాడులకు పాల్పడిన దోషులను వెంటనే శిక్షించాలని, అక్కడ శాంతి భద్రతలు పునరుద్ధరించాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంట సుందర్ కుమార్ డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనలను నిరసిస్తూ కుముదవల్లిలో దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. పాలపర్తి జోనా, ఏ సుందర్ సింగ్, జి.యాకోబు, డీ దానియేలు, ఏ ఆనందకుమార్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-ఏలూరుక్రైమ్: శాంతిభద్రతలకు విభాగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు రౌడీ షీటర్లను హెచ్చరించారు. ఆదివారం ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్లలో సిబ్బందితో కలిసి అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో నివాసం ఉంటున్న రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీట్లు కలిగి ఉండి ప్రజాశాంతికి లేదా ప్రైవేట్ సెటిల్మెంట్ లకు ప్రయత్నం చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

తపన చౌదరి సేవలకు గుర్తింపు

విశాలాంధ్ర-లింగపాలెం: సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో మంచి గుర్తింపు ఉన్న తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరిని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించటంపై ధర్మాజీగూడెంలోని ప్రజలు, పార్టీల రహితంగా నాయకులు సంబరాలు చేసుకుని స్వీట్లు పంచారు. ఈయన పుట్టిన ఊరు దెందులూరు నియోజకవర్గం కొవ్వలి. కాగా వీరి కుటుంబం కొన్నేళ్ళ క్రితం ధర్మాజీగూడెంలో స్థిర నివాసం ఏర్పర్చుకున్నారు. ఈ గ్రామంతోపాటు ఈ ప్రాంతంలో తపన ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంచినీటి సౌకర్యాలు, పేద విద్యార్థులకు చేయూతనిచ్చి ఆదుకోవటం, యువతకు పలు శిక్షణా కార్యక్రమాల దావరా ఉపాధి అవకాశాలు కల్పించటం, అనాధలు, రోగులకు అండగా ఉంటూ ఆప్తునిగా గుర్తింపు తెచ్చుకున్నారు. గ్రామంలో జరిగిన అభినందన సభలో విక్రమ్‌కిషోర్, ఆర్.చక్రధరరావు, కుర్రా సుబ్బారావు, చిన్నం సతీష్, రాయంకుల సాయి, యు.కిట్టియ్య తదితరులు పాల్గొని మాట్లాడారు.

22న బహిరంగ సభ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తణుకు: రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బస్సు యాత్ర పశ్చిమగోదావరి జిల్లాలో ప్రవేశిస్తున్న సందర్భంగా ఈనెల 22న తణుకులో జరగనున్న బహిరంగ సభ విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. తణుకులో వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తణుకులో జరిగే బహిరంగ సభకు సీపీఐ, ప్రజా సంఘాల శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు సీపీఐ జాతీయ, రాష్ట్ర నాయకుల హాజరవుతున్నారన్నారు. కేంద్రంలోబీజేపి ప్రభుత్వం 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలుచేయకపోగా, అన్ని వర్గాల హక్కుల హరించే రీతిలో దుష్ట చట్టాలు చేస్తోందని విమర్శించారు. మహిళలు, దళితులు, మైనారిటీలపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి అభివృద్ధి అటకెక్కిందని వ్యవసాయ, పారిశ్రామిక, నీటిపారుదల రంగాలు నిర్వీర్యమయ్యాయన్నారు. ఈ ప్రభుత్వాల అరాచక, నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బస్సు యాత్రలో భాగంగా తణుకులో జరిగే బహిరంగ సభకు పెద్ద ఎత్తున కార్మికులు, మహిళలు, విద్యార్థులు, యువకులు పాల్గొని సభను విజయవంతం చేయాలని భీమారావు విజ్ఞప్తి చేశారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు సికిలే పుష్పకుమారి, తణుకు ఏరియా కన్వీనర్ టి అప్పలస్వామి పాల్గొన్నారు.

సభకు సర్వం సిద్ధం

సీపీఐ బస్సు యాత్రలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఈనెల 22న ప్రవేశిస్తున్న సందర్భంగా జరగబోయే బహిరంగ సభకు సర్వం సిద్ధం చేసినట్లు కోనాల భీమారావు తెలిపారు. ఆదివారం తణుకు పట్టణంలోని అనేక ప్రాంతాల్లో సీపీఐ తోరణాలతో సర్వాంగ సుందరంగా పట్టణాన్ని కార్యకర్తలు ఏర్పాట్లు చేయడంలో పూర్తిగా నిమగ్నమయ్యారు. ఏర్పాట్లను కోనాల భీమారావు స్వయంగా పర్యవేక్షించారు. పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం కోటిపల్లి రైల్వే లైన్, ప్రజల చిరకాల వాంచగానే మిగిలి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ పశ్చిమగోదావరి జిల్లాలో ఆక్వా రైతులను జోన్ నాన్ ఆక్వాజోన్ పేరుతో ఆక్వా రంగాన్ని కుదేలు చేశారని విమర్శించారు. పారిశ్రామిక రంగాన్ని నిర్వీర్యం చేశారని, కొత్త పరిశ్రమలు లేకపోగా ఉన్న పరిశ్రమలకు మంగళం పాడారని ఎద్దేవా చేశారు. ఏర్పాట్ల పర్యవేక్షణలో సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏరియా కార్యదర్శి టీ అప్పలస్వామి, గార ప్రసాద్, కొంబత్తుల రవికుమార్, మందుల ముత్తయ్య, కోంద్రు నాగబాబు, బిక్కవోలు వెంకటేష్, సరెళ్ళ అంజి, కళ్లేపల్లి రాము, పసల అప్పన్న ఉన్నారు.

బహిరంగ సభ జయప్రదం చేయండి

విశాలాంధ్ర -భీమవరం: రాష్ట్రాన్ని రక్షించుకుందాం-దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో సీపీఐ విశాఖలో ప్రారంభమైన బస్సు యాత్ర ఈ నెల 22న పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రవేశిస్తున్న సందర్భంగా తణుకులో జరుగనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు పిలుపునిచ్చారు. భీమవరంలో సీపీఐ బస్సు యాత్ర ప్రచార జాతా కరపత్రాలను ఆదివారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతి, ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి సీపీఐ చేపట్టిన బస్సు యాత్ర జయప్రదం చేయాలన్నారు. నాయకులు కిలారి మల్లేశ్వరరావు, బంగారు శివ, దుర్గారావు, సాయి, సత్యనారాయణ, నీలాపు శ్రీను, పాలా త్రిమూర్తులు, దుర్గారావు, ఆశీర్వాదం పాల్గొన్నారు.

ఏలూరులో: సేవ్ ఆంధ్ర ప్రదేశ్ చేంజ్ ఇండియా అనే నినాదంతో సీపీఐ బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ పిలుపునిచ్చారు. సీపీఐ ఏలూరు ఏరియా తంగెళ్ళమూడి శాఖ సమావేశం, ఆదివారం హకీమ్ అధ్యక్షతన జరిగినది. సీపీఐ బస్సుయాత్ర 23వ తేదీ ఉదయం 10 గంటలకు ఏలూరు ఆశ్రమం హాస్పిల్ వద్దకు చేరకుంటుందని, అక్కడి నుండి ర్యాలీగా అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్దగల టుబాకో మర్చంట్స్ కళ్యాణమండపం నందు పోలవరం ప్రాజెక్టు సత్వర నిర్మాణం-నిర్వాసితుల సమస్యల పరిష్కారం అనే అంశంపై అఖిలపక్ష పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ళ వరప్రసాద్, కార్యవర్గ సభ్యులు మావూరి విజయ, ఇద్దుం దుర్గారావు,వేణు, ఎస్. కే.బాజి, డి. రాజేశ్వర రావు, అన్వర్ పాల్గొన్నారు.

22న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ధర్నా

విశాలాంధ్ర-చింతలపూడి: ఈనెల 22న మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ధర్నా చేపడుతున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ చింతలపూడి గౌరవాధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా కో కన్వీనర్ తోర్లపాటి బాబు తెలిపారు. ఆదివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం స్థానిక సీపీఐ పట్టణ కార్యాలయంలో జరిగింది. తోర్లపాటి బాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మకుల సమస్యలు చర్చలకే పరిమితం తప్ప పరిష్కారం కావడం లేదన్నారు. మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను క్రమబద్ధీకరిస్తానన్న ముఖ్యమంత్రి జగన్ ఆవైపు ఆలోచించడం లేదన్నారు. ఏ ఒక్క సమస్యపైనా ఆయన స్పందించడం లేదని, దీనికి నిరసనగానే 22న సీడీఎంఏ ముందు జరిగే ధర్నా చేస్తున్నట్టు చెప్పారు. ఈ ధర్నాకు మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కమిటీ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు వెలగాడ అనురాధ, శ్రీరామ్, వెంకటయ్య, ఒడిత్య బాలు, సంధిపం చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ఆక్రమణల తొలగింపు

విశాలాంధ్ర-లింగపాలెం: విశాలాంధ్ర జోక్యంతో ధర్మాజీగూడెంలోని శ్మశాన వాటికలో ఆక్రమణలు తొలగించి దాని చుట్టూ రక్షణగా ఫెన్సింగ్ వేశారు.

గ్రామంలోని దళితవాడలో శ్మశాన వాటికకు రెండు ఎకరాల 16 సెంట్లు స్థలాన్ని పూర్వకాలంలోనే రెవెన్యూ అధికారులు కేటాయించారు. దీనికి పర్యవేక్షణ లేకపోవటంతో ఆక్రమణలపాలైంది. అంతేకాక శ్మశాన వాటికలో నుంచే మార్గాన్ని ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో మనిషి మృతి చెందితే సమాధి చేసేందుకు వీలులేక దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. శ్మశాన వాటికలో ఆక్రమణలు తొలగించి రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతూనే ఉన్నా ఫలితం లేదు. దీనిపై విశాలాంధ్ర ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళటంతో ఆయన స్పందించారు. ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. దీంతో సర్వే చేసి శ్మశాన వాటిక స్థలాన్ని విడగొట్టారు. దీని చుట్టూ రక్షణకు ఫెన్సింగ్ వేసేందుకు మండల పరిషత్ నిధుల నుంచి రూ.3లక్షల కేటాయించి ఫెన్సింగ్ వేశారు. మరో రూ.2 లక్షలు షెడ్డుకు కేటాయించారు. నిధులు ఇచ్చిన ఎంపీపీ వెంకటలక్ష్మిని స్థానికులు అభినందిస్తున్నారు.

ప్రజాస్వామ్యానికి పాతర?

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో పాచ్చానగరం, మఠంగూడెం పంచాయతీల్లో ఒక్కొక్క వార్డుకు జరిగిన ఉపఎన్నిక ఈ గ్రామాల పరిధిలో చరిత్రలో నిలిచాయి. పాచ్చానగరంలో వైసీపీ, టీడీపీ పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటుకు రూ.3వేలు, చీర సమంగా పంపిణీ చేశారు. కొన్ని ఓట్లను అధికంగా డబ్బు ఇచ్చి అదనంగా కొనుగోలు చేశారు. ఈ వార్డులో ఉన్న 197 ఓట్లకు రూ.15 లక్షలకుపైగా పంపిణీ చేశారు. ఇక్కడ 175 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గెలుపుపై భారీ పందేలు జరిగాయి. దాదాపు రూ. 25 లక్షలు మేర పందేలు కాసినట్టు అంచనా. ఇక మఠంగూడెం పంచాయతీ వార్డు మెంబరుకు వైసీపీ మద్దతుతో పోటీలో ఉన్న అభ్యర్థి, జనసేన, టీడీపీలు కలిసి నిలబెట్టిన అభ్యర్థి గెలుపు కోసం తీవ్రంగా కష్టపడ్డారు. ఈ వార్డుకు రెండుపార్టీలు ఓటుకు రూ.600 చొప్పున పంపిణీ చేశారు. రెండుపార్టీలు కొన్ని ఓట్లను లోపాయికారిగా అధిక మొత్తంలో ఇచ్చి కొనుగోలు చేసినట్టు తెలిసింది. ఓట్ల కొనుగోలుకు రెండు పార్టీలు రూ.3 లక్షలపైగా ఖర్చు చేశారనేది అంచనా. కేవలం వార్డు మెంబరు ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని లక్షల్లో డబ్బులు ఖర్చు పెట్టటంపై రాజకీయ విశ్లేషకులు, సామాన్య ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.

31మందిపై కేసు

విశాలాంధ్ర-టీ నరసాపురం: ఫారెస్ట్ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన 31మంది వ్యక్తులపై కేసు నమోదు చేసి నట్లుగా ఎస్ ఐ కె సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం టి నరసాపురం మండలం అల్లంచర్ల అడవిలోకి ఈ నెల 17వ తేదీన కామవరపుకోట మండలం జీలకర్ర గూడెం గ్రామానికి చెందిన 31మంది వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి అడవిని నరుకు చుండగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బి రాజు తన సిబ్బందితో కలిసి వెళ్లి ఆపదానికి ప్రయత్నించిన ఫారెస్ట్ అధికారుల మాట వినకుండా విధులకు ఆటంకం కలిగించారని బీట్ ఆఫీసర్ బి రాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

యువగళం విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ యువగళం పాదయాత్ర ఏలూరు జిల్లాలోని నూజివీడు నియోజకవర్గంలో ప్రవేశిస్తున్న సందర్భంగా పాదయాత్రను విజయవంతం చేయాలని టీడీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన జరిగిన సమన్వయ కమిటీ సమావేశం, ఏలూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రెడ్డి సూర్యచంద్రరావు (చందు) అధ్యక్షతన జరిగింది. ఏలూరు మాజీ ఎంపి మాగంటి బాబు, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, నూజివీడు ఇంచార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు, క్లస్టర్ ఇన్చార్జిలు, డివిజన్ ఇన్చార్జులు పలు నియోజకవర్గ మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

21 కేజీల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర-పాలకొల్లు: పాలకొల్లు మండలం బల్లిపాడు రైల్వే ట్రాక్ దగ్గర 21కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ యు రవిప్రకాష్ తెలిపారు. ఆదివారం పాలకొల్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని రెండు బైక్‌లు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సదరు గంజాయి సుమారు రూ.90 వేలు విలువ ఉంటుందన్నారు. పాలకొల్లు పట్టణ సీఐ రాంబాబు, రూరల్ సిఐ శ్రీనివాస్ కుమార్, ఎస్ ఐ, పోలీసులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఓటరు జాబితా తనిఖీ పూర్తి చేయాలి

విశాలాంధ్ర-పోడూరు: ఓటర్ల జాబితా ఇంటింటి తనిఖీలో ఎటువంటి లోపాలు లేకుండా బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి సూచించారు. మండలంలోని జిన్నూరు -1 సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయం పరిధిలో జరుగుతున్న ఓటర్ల జాబితా తనిఖీ ప్రక్రియను ఆన్‌లైన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పోడూరు తహసిల్దార్ ఆర్ వి కృష్ణారావు డిప్యూటీ తహసీల్దార్ డి రాజేష్ ఆర్ఐ కె రాంబాబు, వీఆర్వో బుజ్జి, సీనియర్ అసిస్టెంట్ త్రిమూర్తులు ఉన్నారు.

మేనిఫెస్టోను విస్తృతంగా ప్రచారం చేయాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: భవిష్యత్తు గ్యారంటీ మేనిఫెస్టో అంశాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని మండల టీడీపీ అధ్యక్షులు పారేపల్లి నరేష్ కోరారు. మండలంలో సరిపల్లిలో టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పార్టీ నాయకుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. గ్రామ కమిటీ అధ్యక్షులు కంకిపాటి బాబురావు, గంటా దుర్గారావు,తాడేపల్లి వెంకటేశ్వరరావు, వెంద్ర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభ విజయవంతం చేయండి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో జరుగుతున్న బస్సు యాత్రలో భాగంగా ఈనెల 23 న జంగారెడ్డిగూడెంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో బస్సు యాత్ర వాదపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టి నాటినుండి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అటకెక్కిందన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాత బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఈనెల 23వ తేదీన జంగారెడ్డిగూడెం పట్టణంలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు సిపిఐ పార్టీ నాయకులు కార్యకర్తలు అత్యధికంగా తరలిరావాలని కోరారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాడుతున్న సీపీఐకి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయక కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ కార్యదర్శి ఎస్కే బాజీ, జక్కు చంద్రం, వెలగ రామారావు, మట్ట రామకృష్ణ, ఎస్. రాంబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పూర్తిగా పడిపోతేనే గాని పట్టించుకోరా...?

విశాలాంధ్ర-పెనుమంత్ర: మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు వాలి ప్రమాదంగా మారాయి. మార్టేరు సబ్ స్టేషన్ పరిధిలో 14వ వార్డులో మార్టేరు నుండి శేషమ్మచెరువు వెళ్లే ప్రధాన మార్గం ప్రభుత్వ మద్యం షాపు సమీపంలో విద్యుత్ స్తంభాలు వాలి అత్యంత ప్రమాదంగా మారాయి. ప్రస్తుతం స్తంభాలు తీగలు పక్కన ఉన్న కొబ్బరి చెట్లపై ఆధారపడి ఉన్నాయి. వీటి విషయంలో మార్టేరు స్టేషన్ సిబ్బంది చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా చిన్న పాటి గాలులకు విద్యుత్ స్తంభాలు కూలి గంటల తరబడి సరఫరాకు అంతరాయం కలుగుతుంది. మండలంలో అత్యధిక ప్రాంతాల్లో వాలిపోయిన స్తంభాలే దర్శనమిస్తున్నాయి. విద్యుత్ శాఖ వారు పడిపోతేనే గాని పట్టించుకోరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ శాఖ ఉన్నత అధికారులు తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

మృతి చెందిన డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం

విశాలాంధ్ర-ఏలూరు: ఇంటర్నేషనల్ మెడికల్ ట్రాన్స్పోర్ట్ డే పురస్కరించుకుని స్మార్ట్ ప్రొఫెషనల్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏలూరు ఇండోర్ స్టేడియం వద్ద కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యా లరావు పాల్గొన్నారు. కోవిడ్ సమయంలో మృతి చెందిన 108 డ్రైవర్ రాజారావు కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఇండోర్ స్టేడియం నుండి పాత బస్టాండ్ వరకు 108, 104, తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్, 30 ప్రైవేట్ అంబులెన్స్‌లతో భారీ ర్యాలీ చేపట్టారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ బూసి సురేంద్ర , లయన్స్ గ్లోబల్ సర్వీస్ కోఆర్డినేటర్ చుక్కా అవినాష్ రాజు, ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్ వెల్లంకి సత్య స్వరూప్, రీజియన్ ఛైర్పర్సన్ శేషు కుమార్, స్పెషాలిటీ క్లబ్స్ కోఆర్డినేటర్ ఎస్. వి. సురేష్ కుమార్, అరోబిందో మెడికల్ ఎమర్జెన్సీ సర్వీసెస్ జోనల్ మేనేజర్ గణేష్, అంబులెన్స్ యజమానులు, డ్రైవర్స్ పాల్గొన్నారు.

రెండువార్డుల్లో వైసీపీ విజయం

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో రెండు వార్డు మెంబర్లకు జరిగిన ఉప ఎన్నికల్లో వైసీపీ మద్దతు తెలిపిన అభ్యర్థులు విజయం సాధించారు. పాశ్చానగరం వార్డు మెంబరుకు నువ్వానేనా అన్నట్టుగా జరిగిన ఎన్నికల్లో పొన్నుబోయిన రమేష్ రెండు ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. ఇక్కడ 175 ఓట్లు పోలవ్వగా రమేష్‌కు 88 ఓట్లు వచ్చాయి. ఒక ఓటు చెల్లలేదు. ప్రత్యర్థి అభ్యర్థి శిరావెంకటేశ్వరరావుకు 86 ఓట్లు వచ్చాయి. మఠంగూడెం పంచాయతీ వైసీపీ మద్ధతుతో పోటీ చేసిన పిల్లి శాంతిలీలకు 119 ఓట్లు వచ్చాయి. 61 ఓట్లు అధిక మెజార్టీతో ఈమె విజయం సాధించింది. జనసేన-టీడీపీ మద్దతుతో పోటీ చేసిన సాయిల జ్యోతికి 58 ఓట్లు వచ్చాయి. రెండుచోట్ల వైసీపీ అభ్యర్థులు గెలుపొందటంతో ఈ పార్టీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఏకగ్రీవం కావాల్సిన ఎన్నికల్లో పోటీ పెట్టటం వల్ల నెలకొన్న పరిణామాలు, ఫలితాల తీరుపై టీడీపీ నేతలు సమీక్ష చేసుకుంటున్నారు.